క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: మండలంలోని పోటుమెరక, గంగడిపాలెం, లంకెవానిదిబ్బ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు డీఈఈ ఎస్.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా విధించే కోతకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు గుళ్లపల్లిలో మోడల్ టెస్ట్

భట్టిప్రోలు: ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు శనివారం చెరుకుపల్లి మండలంలోని గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బాపట్ల జిల్లా స్థాయి మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఎంఈవో పులి లాజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి పరీక్ష ప్రారంభమవుతుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ప్రధానోపాధ్యాయుల నుంచి ధృవీకరణ పత్రం తప్పని సరిగా తీసుకు రావాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులతో వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు విచ్చేయనున్నట్లు తెలిపారు.

27న కార్మిక మహా గర్జన

రేపల్లె: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయాలన్న పాలకుల కుట్రకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 27న విశాఖపట్నంలో కార్మిక మహా గర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా ప్రైవేటీకరణకు నిరసనగా 23, 24తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల వద్ద సామూహిక దీక్షలు, 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

24న దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలం

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లింగోద్భవ స్వామి దేవస్థానం ఆవరణలోని 1, 2 దుకాణాల నిర్వహణకు 38 నెలల కాలపరిమితికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న ఉదయం 11 గంటలకు దేవస్థానం నందు బహిరంగ వేలం జరుగుతుందని పేర్కొన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 2026 మార్చి 31వ తేదీ వరకు కాలపరిమితి ఉంటుందని తెలిపారు.

నేడు అమావాస్య హోమం:
మండలంలోని చందోలు బండ్లమ్మ దేవాలయంలో శనివారం సాయంత్రం 47వ అమావాస్య హోమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి తెలిపారు.

ఫెన్సింగ్‌లో విద్యార్థికి కాంస్యం



కర్లపాలెం: రాష్ట్ర స్థాయిలో జరిగిన ఫెన్సింగ్ పోటీలలో పదో తరగతి విద్యార్థి ధర్మేంద్ర పోతురాజురెడ్డి ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడని హైవెండ్ హైస్కూల్ హెచ్ఎం డి.ఏసోబు, డైరక్టర్ పెదమల్లు చాందినీ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ధర్మేంద్ర పోతురాజురెడ్డికి అభినందన సభ నిర్వహించారు. హెచ్ఎం ఏసోబు మాట్లాడుతూ ఈ నెల 18, 19 తేదీల్లో కర్నూలులో జరిగిన 66వ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఆర్.గోపిచంద్, ఉపాధ్యాయులు బాషా, మణిబాబు, హారిక తదితరులు ఉన్నారు.

తొలి వెలుగులు



ప్యాడిసన్ పేట జగనన్న కాలనీలోని ఓ ఇంటికి విద్యుత్ సౌకర్యం..



వీధి దీపాల వెలుగుల్లో ప్యాడిసన్ పేట జగనన్న కాలనీ..

- జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం
- ప్రతి ఇంటికీ ఉచితంగా విద్యుత్ కనెక్షన్
- లబ్ధిదారుల మోములో చిరు నవ్వులు
- బాపట్ల మున్సిపాలిటీలో వెలిగిపోతున్న లే అవుట్లు

బాపట్ల అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్య సాధనలో 'తొలి వెలుగులు' పడ్డాయి. ఇల్లు లేని ప్రతి పేదవాడికి నివాస యోగ్యం కల్పించాలని ఆయన తలపెట్టిన గృహ యజ్ఞం ఫలాలు లబ్ధిదారులకు అందుతున్నాయి. ఇప్పటికే వైఎస్సార్ జగనన్న కాలనీల్లో శరవేగంగా ఇళ్ల నిర్మాణం జరుగుతుండగా.. అంతే వేగంగా మౌలిక వసతుల కల్పన జరుగుతోంది. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ జగనన్న లే అవుట్లలో విద్యుత్ సదుపాయాన్ని అధికారులు కల్పించారు. నిర్మాణం పూర్తయిన ప్రతి ఇంటికి ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి సమాయత్తం అవుతున్నారు. విద్యుత్ కనెక్షన్‌తో లబ్ధిదారుల మోములో చిరునవ్వులు వెదజల్లుతున్నాయి. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్యాడిసన్‌పేట, బేతనీకాలనీ, మూలపాలెంలో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. ఈ కాలనీలలో 3,300 మందికి ఇళ్ల పట్టాలను అధికారులు పంపిణీ చేశారు. వీటిలో 2,450ఇళ్లు నిర్మాణంలో ఉండగా.. మిగిలిన 600 ఇళ్లు నిర్మాణం పూర్తిచేసుకొని.. లబ్ధిదారులు నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ సీపీడీసీఎల్ ద్వారా లే అవుట్లలో స్తంభాలు ఏర్పాటు చేసి, వైరింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేశారు. వీధి దీపాల వెలుగుల్లో జగనన్న కాలనీలు వెలిగిపోతున్నాయి. నివాసాలకు మీటర్లు ఏర్పాటు చేసి, కనెక్షన్ ఇచ్చి విద్యుత్ సదుపాయం కల్పించారు. మిగిలిన ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మేరకు విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇవ్వడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ..విద్యుత్ శాఖ అధికారులకు ఉచిత విద్యుత్ కనెక్షన్ల కోసం సిఫార్సు చేసింది. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది



కాలనీలో విద్యుత్ సదుపాయం కల్పించడం ఆనందంగా ఉంది. విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడం.. నివాసానికి యోగ్యంగా ఉంటుంది. జీవనానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు.

–కల్లి నాగేశ్వరమ్మ, లబ్ధిదారురాలు

గృహ ప్రవేశాలు



కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. మా ఇళ్లకు విద్యుత్ సదుపాయం కలుగనుంది. గృహ ప్రవేశం అయినా.. విద్యుత్ లేకపోవటంతో ఇళ్లలోకి చేరలేదు. ఇప్పుడు ఆ వెలితి తీరనుంది.

– చుండూరు సీతారావమ్మ, లబ్ధిదారురాలు

ఉచితంగా విద్యుత్ కనెక్షన్



బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో మూడు వైఎస్సార్ జగనన్న లే అవుట్లున్నాయి. వాటిలో 600 మంది నివాసం ఉంటున్నారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు ఉచితంగా విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడం జరిగింది. లే అవుట్లలో ఇప్పటికే విద్యుత్ సదుపాయం కల్పించాం. మిగిలిన ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు త్వరలో ఇస్తాం.

–డీఈ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ

వ్యాధులను అరికట్టడంలో ప్రతి ఒక్కరి కృషి అవసరం

డ్రైడే కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: కీటక జనిత వ్యాధులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరి కృషి అవసరమని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్లలోని తన నివాసంలో వైద్యా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఫ్రైడే.. డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టు పక్కల పరిశుభ్రంగా ఉంచుకునేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల నియంత్రణ, నిర్మూలనకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. దోమల వల్ల డెంగీ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడు వాపు వంటి వ్యాధులు వస్తాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వై.రాజకుమార్, పొన్నూరు సబ్ యూనిట్ అధికారి షేక్ దస్తగిరి, హెల్త్ సూపర్‌వైజర్లు జూగుంట రాంబాబు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది

– రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



యువతితో సంక్షేమ పథకాలపై మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చరిత్ర పుటల్లో నిలిచిపోతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. మండలంలోని పల్లపట్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండవ రోజు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సీఎం మది నుంచి జాలువారిన నవరత్నాల పథకాలను ప్రతి గడపకు చేరుస్తున్న తీరు మరువలేనిదన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేందుకు పటిష్టమైన వ్యవస్థలను రూపొందించి, అమలు చేస్తున్న తీరు దేశంలోని ప్రతి రాష్ట్రం అమలు చేసే విధంగా ఉందన్నారు. గడప గడపకు వెళ్లి తలుపు తడుతుంటే లబ్ధిదారులు ఆనందంతో స్వాగతం పలుకుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని చెబుతున్నారన్నారు. పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక చంద్రబాబు ప్రజలను తప్పుదోవ పట్టించే కుయుక్తులకు తెగబడుతున్నారని మండిపడ్డారు.

సచివాలయ నిర్మాణానికి శంకుస్థాపన:
గ్రామంలో నూతన సచివాలయ నిర్మాణానికి ఎంపీ మోపిదేవి శంకుస్థాపన చేశారు. కొబ్బరికాయ కొట్టి, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి చిన్న అవసరానికి మండల కేంద్రానికి పరుగులు తీయాల్సిన పరిస్థితులను మార్చే విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను రూపొందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, సర్పంచ్ గంగుల రత్న వెంకటప్రసాద్, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పందరబోయిన బసవపున్నారావు, నాయకులు ప్రసాదం వాసుదేవ, శంకర్‌నాథ్, షరీఫ్ బేగ్, డొక్కా సాంబ శివరావు, వంశీకృష్ణ, ఎన్.గోపీ, ఎస్తేరురాణి, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందిస్తాం

– ఎమ్మెల్యే కోన రఘుపతి



లబ్ధిదారులకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: సంక్షేమ పథకాలు ప్రతి ఇంటా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అర్హతే ఆధారంగా ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పింఛన్లు నగదు రూ.250 పెంచడం వల్ల పింఛన్‌దారులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. వలంటీర్ల వ్యవస్థపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు తీసుకుపోవటానికి వలంటీర్లు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, ఎంపీడీఓ రాధాకృష్ణ, కోటా వెంకటేశ్వరరెడ్డి, సారధిరెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు 'గీతం' విద్యార్థులు



రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

చెరుకుపల్లి: రాష్ట్ర స్థాయి క్రీడలకు మండలంలోని పొన్నపల్లి గ్రామంలోని గీతం జూనియర్ కళాశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ పైనం ఏడుకొండలురెడ్డి చెప్పారు. స్థానిక కళాశాలలో శుక్రవారం విద్యార్థులను అభినందించి, ఆయన మాట్లాడారు. గతేడాది నవంబర్‌లో పిట్టలవానిపాలెం జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో వివిధ విభాగాల్లో విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఐదు కిలోమీటర్ల విభాగంలో ఆర్.జశ్వంత్, ఎస్.మణికంఠ లోహిత్, బి.శ్రీరామ్‌రెడ్డి, కె.తిరుమలరెడ్డి, ఎస్కే జమ్‌షేద్, షాట్‌పుట్, డిస్కస్ త్రో విభాగంలో పి.పోతురాజు, 100 మీటర్ల విభాగంలో టి.మణికంఠరెడ్డి, 200 మీటర్ల విభాగంలో ఎం.మిజేంద్రబాబు, షాట్‌పుట్ మహిళా విభాగంలో తేజశ్విని ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 21, 22, 23తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చినరావూరులో క్షుద్రపూజల కలకలం!

తెనాలిరూరల్: చినరావూరులో క్షుద్రపూజల చేసినట్టు కలకలం రేగింది. చినరావూరు రైల్వే స్టేషన్‌కి వెళ్లే దారిలో నాలుగు రోడ్ల కూడలిలో అర్ధరాత్రి పూజలు చేసిన ఆనవాళ్లను శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించారు. రోడ్డు మధ్యలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, కొబ్బరికాయలు, ఎండుమిర్చి, రక్తంతో పూజలు చేసినట్టు ఉంది. ఎవరైనా క్షుద్రపూజలు చేయించారా లేక ఆకతాయిల పనా అని ఇక్కడి ప్రజలు ఆరా తీస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉండేవని, ప్రస్తుతం పని చేయడంలేదని స్థానికులు చెబుతున్నారు.

పేద పాస్టర్లకు నిత్యావసరాలు

తెనాలిఅర్బన్: మైకా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఐతానగర్‌లోని మైకా చర్చి వద్ద శుక్రవారం పేద పాస్టర్లకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ పాముల రవికుమారి, పాముల రిచర్డ్ పాల్గొన్నారు.

కాపునాడు క్యాలెండర్ ఆవిష్కరణ

తెనాలిఅర్బన్: వంగవీటి రాధా రంగా స్మారక కాపు యువజన సేవా సమితి వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో ఇంజినీర్ చెన్నంశెట్టి రమేష్ సహకారంతో కొత్తగా రూపొందించిన క్యాలెండర్‌ను ప్రియదర్శిని విద్యాసంస్థల అధినేత చందు రామారావు ఆవిష్కరించారు. బాలాజీరావుపేటలో శుక్రవారం కార్యక్రమం జరిగింది.

అందుబాటులో హాల్ టిక్కెట్లు

భట్టిప్రోలు: జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) ఫిబ్రవరి 5న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుందని ఎంఈవో పులి లాజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్లు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. సంబంధిత ఉపాధ్యాయులు పాఠశాల యూ–డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయ్యి ఆయా పాఠశాలలకు సంబంధించిన విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు డి.దేవానందరెడ్డి ఉత్తర్వులు పంపినట్లు వివరించారు.

చందోలులో ఘనంగా హరిద్ర శృంగార్చన



పూజా కార్యక్రమంలో భక్తులు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం 43వ హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ.. చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగ పిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు అందజేసిన స్టడీ మెటీరియల్‌తో హెచ్ఎం, ఉపాధ్యాయులు

భట్టిప్రోలు: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ (ఎన్ఎంఎంఎస్)కు శిక్షణ పొందుతున్న భట్టిప్రోలులోని టీఎంరావు ఉన్నతపాఠశాల 8వ తరగతి విద్యార్థులు 23 మందికి శుక్రవారం ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రత్యేకంగా ఈ పుస్తకాలను శిక్షణ పొందుతున్న విద్యార్థుల కోసం రూపొందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.కోటేశ్వరమ్మ, సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గో వ్యథ

- బాపట్ల పట్టణంలో గోవులకు లంపీ స్కిన్ వ్యాధి
- రోడ్లపై వదిలేసిన యజమానులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



పట్టణంలో లంపీస్కిన్ వ్యాధి బారిన పడిన ఆవు



వ్యాధి సోకిన ఆవును పొడుస్తున్న కాకులు

బాపట్లటౌన్: ఈ గోవుల వ్యథ అధికారులకు చెప్పినా.. తీరనది. వేళకు ఇంత మేత వేసి.. ఆలనా పాలనా చూసే యజమాని కనిపించడు. శరీరమంతా నల్లటి మచ్చలు... పడిన పుండ్లు.. అప్పుడప్పుడూ వాటిని పొడిచే కాకులు. మేత దొరక్క డొక్కలు ఎండి బాపట్ల మునిసిపాలిటీ పరిధిలో దీనంగా గోవులు తిరుగుతున్నాయి. రెప్పపాటులోనే పశువులకు విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న లంపీ స్కిన్ వ్యాధి బారిన పడి అల్లాడిపోతున్నాయి. వ్యాధి తీవ్రరూపం దాలిస్తే ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నాయి. కనీసం వైద్యం అందించడానికి కూడా వీలులేకుండా పోతోంది. ఈ ఆవులను యజమానులు తోలుక్లే విధంగా చర్యలు తీసుకోవాలని.. పశు వైద్యాధికారులు ఇప్పటికే పురపాలక సంఘ అధికారులకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందజేసి వారం గడుస్తున్నా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో రోజురోజుకు వ్యాధి తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని వాటిని కాపాడేవిధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

భట్టిప్రోలు: జగనన్న కాలనీలో గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం శుక్రవారం అందజేశారు. అలాగే నిర్మాణానికి అవసరమైన సిమెంటు, ఇసుక, ఇనుము ఉచితంగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బాపట్ల జిల్లా కమిటీ సభ్యుడు జి.బాలాజి, నాయకులు బి.శ్రీనివాసరావు, పి.శ్రీకాంత్, రమేష్, రఘురామ ప్రసాద్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఖాజీపాలెంలో వైద్య సేవలు

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో 104 వాహన వైద్యులు వైద్య సేవలను శుక్రవారం అందించారు. డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ.. ప్రతి నెలా ఒక రోజు గ్రామ సచివాలయం వద్ద వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం దీర్ఘకాలిక రోగులు, మంచం నుంచి పైకి లేవలేని వారి ఇంటివద్దకే వెళ్లి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మొత్తం 60 మంది రోగులను పరీక్షించి, మందులు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎం అనిత, డీఈఓ సాయికిషోర్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.